క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కడివేటి అన్వేష్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. పూల మొక్కను అందజేసి కృతజ్ఞతలను తెలియజేశారు.

వెంకటేశ్వర స్వామికి అభిషేకం



పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం రేవతి నక్షత్రం సందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. నెలకు ఒక పర్యాయం మాత్రమే మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించడం జరుగుతుందని అర్చకులు వెల్లడించారు. మహిళా భక్తులు పాలు, పెరుగు, తేనె, చక్కర, పూలు, పండ్లు తీసుకెళ్లి స్వామికి అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

రెవెన్యూ ఉద్యోగుల సేవలు అమోఘం



సత్కారం అందుకున్న విశ్రాంత ఉద్యోగులతో అధికారులు

కొడవలూరు: రెవెన్యూ శాఖ ఉద్యోగులు అందిస్తున్న సేవలను తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి కొనియాడారు. రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని నలుగురు రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సత్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. రెవెన్యూ సేవలను సకాలంలో అందించి ప్రజల మన్ననలను పొందాలని కాంక్షించారు. డీటీ సారంగపాణి, ఆర్ఐ హైమావతి, సీనియర్ సహాయకుడు మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న నారుమడులు

- సాంకేతిక లోపంతో అందని సాగునీరు
- దక్షిణ కాలువ కింద వరినార్లు
- నాట్లపై రైతుల సందిగ్ధం
- ఎడగారులో ఇదీ పరిస్థితి



చివరి ఆయకట్టులో ఎండుతున్న నారుమడులు

పొదలకూరు: దక్షిణ కాలువ చివరి ఆయకట్టైన మండలంలోని చెన్నారెడ్డిపల్లి, నావూరు, భోగసముద్రం, బత్తులపల్లి, చేజర్ల మండలం కొండలరాయుడుకండ్రిక గ్రామాలకు సాగునీటి సౌకర్యం ఉంది. దీంతో ఖరీఫ్ సాగు కింద అధికారులు ఈ ప్రాంత నాన్‌డెల్టా రైతులను సైతం వరి సాగు కోసం నార్లు పోసుకోవాల్సిందిగా సూచించారు. అయితే నారుమడులకే అధికారులు సక్రమంగా సాగునీటిన ఇవ్వలేకపోవడంతో రైతులు ఢీలా పడుతున్నారు. ప్రస్తుతం నార్లు ఎండుదశకు చేరుకుంటున్నట్టు చెబుతున్నారు. దక్షిణ కాలువకు సోమశిల నుంచి నీటిని విడుదల చేసే గేట్‌కు సాంకేతిక లోపం ఏర్పడటంతో కాలువకు ప్రస్తుతం 350 క్యూసెక్కులు మాత్రమే నీరు విడుదలవుతోంది. దీంతో చివరి ఆయకట్టుగా ఉన్న మండలంలో గ్రామాల్లో నార్లు కాపాడుకునేందుకు కూడా నీరు సక్రమంగా రావడం లేదు. దీనికితోడు పైతట్టు ప్రాంతం రైతులు విద్యుత్ మోటార్లను వినియోగించడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు చేరడం లేదు.

రైతుల ఇబ్బందులు

దక్షిణ కాలువ దాని ఉప కాలువలైన 7ఆర్, 26ఎల్ కాలువ ద్వారా చివరి ఆయకట్టుగా ఉన్న చెన్నారెడ్డిపల్లి, నావూరు, భోగసముద్రం, కొండలరాయుడుకండ్రిక గ్రామాలకు సాగునీరు అందడం లేదు. రైతులు నారుమడులను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నారుమడులు ఎండుదశకు చేరుకోవడంతో వదిలివేస్తామని కొందరు వెల్లడించారు. చెన్నారెడ్డిపల్లి రైతులు 400 ఎకరాలు, భోగసముద్రం రైతులు 100 ఎకరాలు, కొండలరాయుడుకండ్రిక రైతులు 400 ఎకరాలు నాట్లు సరిపడా నార్లు పోసుకున్నారు.

నాట్లు వేసేందుకు సందిగ్ధంలో పడి సాగునీరు సక్రమంగా ఇవ్వలేకపోతే నష్టపోతామని ముందస్తుగా స్వల్ప ఖర్చులతోనే సరిపెట్టుకుంటే పోతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ యత్నాలు

సోమశిల దక్షిణ కాలువ నుంచి సాగేనీరు ఆయకట్టు భూములకు సరిపడా రాకపోవడంతో అదనపు సాగునీటిని పంపేందుకు సోమశిల అధికారులు ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నారు. కండలేరు వరదకాలువ నుంచి దక్షిణ కాలువకు నీటిని వదలేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. 43వ కి.మీ వద్ద వరద గేట్ల ద్వారా సాగునీటిని సరఫరా చేసేందుకు పనులు చేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా చివరి ఆయకట్టుకు సాగునీటిని అందించగలమని అధికారులు రైతు సంఘాల ప్రతినిధులతో వెల్లడించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు: బాల్య వివాహాలతో అనర్థాలు సంభవిస్తాయని ఎమ్మెల్‌హెచ్‌పీ సుష్మ పేర్కొన్నారు. బాల్య వివాహాలతో సంభవించే దుష్ప్రభావాలపై మండలంలోని రెడ్డిపాళెం గిరిజన కాలనీలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలకు 18 ఏళ్లలోపు వివాహం చేస్తే ఆరోగ్య సమస్యలొస్తాయని చెప్పారు. గిరిజనుల్లో బాల్య వివాహాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఏఎన్ఎం నదియా పాల్గొన్నారు.

ఏఓ సేవలను కొనియాడుతూ..



ఏఓను సన్మానించిన సిబ్బంది

మనుబోలు: బదిలీపై వెళ్లిన మనుబోలు మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్‌ను స్థానిక రైతు సేవా కేంద్రంలో సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జహీర్ నిత్యం రైతులు అందుబాటులో ఉంటూ వారికి సలహాలిచ్చేవారన్నారు. కార్యక్రమంలో ప్రస్తుత ఏఓ వెంకటకృష్ణయ్య, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు సహకరించాలి



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లాలో టీబీని పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు సహకరించాలని జిల్లా టీబీ నివారణాధికారి, ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ సూచించారు. నగరంలోని నారాయణ మెడికల్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ ఆస్పత్రులో టీబీ కేసులను నోటిఫై చేస్తే వైద్య శాఖకు తక్షణమే సమాచారమివ్వాలని కోరారు. నారాయణ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ విశ్వకుమార్, పల్మనాలజీ హెచ్ఓడీ ప్రసన్న పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు యోగాంధ్ర కార్యక్రమం

పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం ఉదయం 6 గంటలకు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎంపీడీఓ డీవీ నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతిష్టాత్మకంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు వెల్లడించారు. మండల స్థాయి అధికారులు, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొనాల్సిందిగా కోరారు.

బీజేపీలో పలువురి చేరిక



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: దామరమడుగు, ఇస్కపాళెం పంచాయతీలోని పలువురు నేతలు బీజేపీలో శుక్రవారం చేరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత వికసిత్ భారత్ – 2047 ప్రతిజ్ఞ చేశారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వివాహిత అదృశ్యమైన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా దర్శికి చెందిన వివాహిత నెల్లూరులోని పుట్టింటికి బుధవారం వచ్చారు. ఈ క్రమంలో ఇంటి నుంచి గురువారం తెల్లవారుజామున ఆమె అదృశ్యమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు తండ్రి గురవయ్య ఫిర్యాదు చేశారు. కుమార్తె అదృశ్యం వెనుక జిల్లా పోలీస్ కార్యాలయంలో పనిచేసే ఓ వ్యక్తి ప్రమేయం ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాయింట్ పట్టా భూములకు సబ్ డివిజన్

జలదంకి: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ పట్టా భూములుగా నమోదైన రైతుల భూములను సబ్ డివిజన్ చేస్తున్నట్లు సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన జలదంకి తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్ శోభన్‌బాబుతో కలిసి రీసర్వే చేసిన గ్రామాలు, జాయింట్ భూముల రైతుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగశేఖర్ మాట్లాడుతూ జాయింట్ పట్టా భూములుగా నమోదైన రైతులకు సంక్షేమ పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు పొందడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీంతో జేసీ కార్తీక్ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో సబ్ డివిజన్ నమోదుకు రూ.550 చెల్లించాల్సి ఉండేదన్నారు. ప్రస్తుతం రైతులు స్థానిక సచివాలయంలో రూ.50 చెల్లిస్తే జాయింట్ పట్టా భూములను సబ్ డివిజన్ భూములుగా మార్పు చేస్తారని వివరించారు. ఈ నెల 30వ తేదీ లోగా రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమీల, డీఐఓసీ శ్రీనివాసరావు, సచివాలయ సర్వేయర్లు ఉన్నారు.

ఉదయగిరి డిపోకు రూ.ఏడు లక్షల ఆదాయం

ఉదయగిరి రూరల్: నర్రవాడ వెంగమాంబ తిరునాళ్లకు ప్రత్యేక సర్వీసులను నడపడం ద్వారా ఉదయగిరి డిపోకు రూ.6,96,295 ఆదాయం వచ్చిందని డిపో మేనేజరు శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరి, పోరుమామిళ్ల, బద్వేలు నుంచి నర్రవాడకు 22 ప్రత్యేక బస్సులను నడిపినట్లు తెలిపారు. ఈ బస్సులు 13,770 కి.మీ దూరం తిరిగాయని చెప్పారు. డిపోకు ఆదాయం తీసుకురావడానికి సహకరించిన డ్రైవర్లు,కండక్టర్లు, ఇతర సిబ్బందికి అభినందనలు తెలిపారు.

యార్డులో నిరుపయోగంగా మరుగుదొడ్లు



పొదలకూరు: స్థానిక ప్రభుత్వ నిమ్మ మార్కెట్ యార్డులో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. వ్యాపారులు, రైతుల కోసం యార్డు ఏర్పడిన తర్వాత మరుగుదొడ్లను నిర్మించారు. అయితే అప్పటి నుంచి నీటి సౌకర్యం కల్పించకపోవడంతో చాలాకాలంగా వినియోగంలో లేవు. దీంతో యార్డుకు వచ్చే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ నిమ్మ మార్కెట్ యార్డు పొదలకూరులోనే ఉంది. ఇక్కడ అంతర్గత సిమెంట్ రోడ్లు, అదనపు దుకాణాలు, వ్యాపారులు చేసుకునేందుకు ప్లాట్‌ఫారమ్స్ నిర్మించారు. దాదాపుగా అన్ని వసతులున్న యార్డులో మరుగుదొడ్ల సౌకర్యం కల్పించలేకపోతున్నట్టు తెలుస్తోంది. నిర్మించిన మరుగుదొడ్ల చుట్టుపక్కల చెత్తతో నిండి ఉంది. మార్కెటింగ్‌శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎంపీపీ వజ్రమ్మ



మాట్లాడుతున్న వజ్రమ్మ

మనుబోలు: అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ గుండాల వజ్రమ్మ కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా మరో రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందని తెలిపారు. మండలంలో 33 మందికి తప్ప మిగిలిన వారందరికీ ఈకేవైసీ పూర్తయిందన్నారు. హౌసింగ్ ఏఈ శరత్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకూ 670 ఇళ్లు పూర్తి చేశామని తెలిపారు. కొత్తగా 868 ఇళ్లకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వెలుగు ఏపీఎం వనజాక్షి మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో రూ.25 కోట్ల ఆర్థిక రుణాలను పూర్తి చేశామన్నారు. చిన్న పరిశ్రమలు పెట్టుకునే మహిళలకు రూ.1.35 లక్షల సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంకా పలువులు అధికారులు వారి శాఖల పరిధిలోని పురోగతిని వివరించారు.

సీతారామిరెడ్డికి ప్రసన్న పరామర్శ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మేనకూరు సీతారామిరెడ్డిని పట్టణంలోని ఆయన నివాసంలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నగర పంచాయతీలో పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు షాహుల్, సతీష్‌రెడ్డి, గొల్లపల్లి విజయ్‌కుమార్, కోడూరు మధుసూదన్‌రెడ్డి, బాలశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలంటూ నిరసన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఎదుట శుక్రవారం చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. హామీలను టీడీపీ, జనసేన, బీజేపీ తుంగలో తొక్కాయని ఆరోపించారు. ప్రజలను పక్కదారి పట్టించేందుకే యోగాంధ్ర పేరుతో నెల రోజులుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని విమర్శించారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

వెంకటాచలం: యోగాంధ్ర – 2025 కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వీసీ అల్లం శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధన ద్వారా శరీరాన్ని శక్తివంతంగా, మనసును ప్రశాంతంగా మార్చుకోవచ్చన్నారు. సంప్రదాయ విలువలు, సంస్కృతిని ప్రోత్సహించడంలో వర్సిటీ ప్రత్యేక చొరవ చూపుతుందని తెలియజేశారు. యోగా దినోత్సవం విద్యార్థుల్లో ఆరోగ్యపరమైన అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా స్పీడ్ బ్రేకర్లు



స్పీడ్ బ్రేకర్లను ఇష్టానుసారం ఏర్పాటు చేస్తున్నారు.

పొదలకూరు: మండలంలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గ్రామాల్లో ఆటోలు, ద్విచక్రవాహనాలను నియంత్రించాలనే ఉద్దేశంతో వీటిని గ్రామస్తులే ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే ఇష్టానుసారంగా నిర్మిస్తుండటంతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. మరుపూరులోని మెయిన్ రోడ్డు వద్ద ప్రమాదాలు జరగడంతో వీటిని గ్రామస్తులు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఇవే ప్రాణాలను హరించాయి. దీంతో స్పీడ్ బ్రేకర్ల ఎత్తును తగ్గించారు. ప్రతి గ్రామం వద్ద ఒకట్రెండు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయడంతో ద్విచక్రవాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోవైపు కొన్ని గ్రామాల్లో ఆటోలు, బస్సులను సక్రమంగా నిలపడంలేదనే అత్యుత్సాహంతో

వేడుకగా రంగడి గోపురోత్సవం



నెల్లూరు(బృందావనం): రేవతి నక్షత్రాన్ని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో తిరుమంజనం, గోపురోత్సవాన్ని వేడుకగా శుక్రవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా సోమిశెట్టి గురుప్రసాద్, రాజేశ్వరి దంపతులు తదితరులు వ్యవహరించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

➡ శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగడ్ని ఎస్పీ కృష్ణకాంత్ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరిని ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

పెట్టుబడి సాయమేదీ..?

- పీఎం కిసాన్ మినహా మిగిలిన వాటిపై స్పష్టత కరువు
- అమలుకు నోచుకోని హామీలు
- అన్నదాతల ఆవేదన



సాగులో వరి

కోవూరు: ఖరీఫ్ సీజన్ ఊపందుకుంటున్న వేళ.. పెట్టుబడి సాయంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పొలాలను రైతులు ప్రస్తుతం సిద్ధం చేసుకుంటున్నారు. దుక్కులు దున్నడం.. విత్తనాల కొనుగోలు.. నారుమడుల తయారీకి నగదు ప్రస్తుతం అవసరం. కేంద్ర ప్రభుత్వం అందించిన పీఎం కిసాన్ నిధులు రూ.రెండు వేలు వారి ఖాతాల్లో జమయ్యాయి. గత ప్రభుత్వంలో మాదిరిగా ప్రస్తుత ప్రభుత్వం నుంచి సాయం ఇప్పటికీ అందడంలేదు.

వరినాట్లు ప్రారంభం

కోవూరు నియోజకవర్గంలో వరినాట్లు ప్రారంభమయ్యాయి. దీంతో ఖరీఫ్ సాగు షురూ అయింది. ఇప్పటికే దాదాపు 40 వేల ఎకరాల్లో పంటల సాగు మొదలైంది. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అయితే పెట్టుబడి సాయం ఆలస్యం కావడంతో ఇది పెద్ద సవాల్‌గా మారింది. ఇప్పటికే విత్తనాల ధరలు పెరగ్గా.. ఎరువులు కొనాలన్నా డబ్బు లేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడంలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఇలా..

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ ప్రారంభంలోనే రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందేది. పీఎం కిసాన్ రూ.ఆరు వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.7,500 ద్వారా ఏడాదికి రూ.13,500ను మూడు విడతల్లో జమ చేసేవారు. ఖరీఫ్ ప్రారంభంలో రూ.7,500, పంట కోత సమయంలో రూ.నాలుగు వేలు, ధాన్యం విక్రయాలు ప్రారంభమయ్యే సమయంలో రూ.రెండు వేలు అందేవి.

కౌలు రైతులకూ భరోసా

భూమి లేని రైతులు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన కౌలు రైతులు, అటవీ, దేవదాయ భూములను సాగు చేసేవారికీ వైఎస్సార్ రైతు భరోసా వర్తించేది. పీఎం కిసాన్ పథకం కింద తొలి విడతగా కేంద్రం పంపిన రూ.రెండు వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనంగా రూ.5,500తో కలిపి రూ.7,500 ఇచ్చే విధానం అమల్లో ఉండేది. కోవూరు నియోజకవర్గంలో 16631 మంది రైతులు ఈ పథకానికి అర్హులుగా ఉండేవారు.

నేడు తప్పని ఎదురుచూపులు

రైతులకు ఏడాదికి రూ.20 వేలను పెట్టుబడి సాయంగా అందిస్తామని ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఊదరగొట్టాయి. అయితే ప్రస్తుతం ఎలాంటి ప్రకటన రాకపోవడం రైతులను కలవరానికి గురిచేస్తోంది. ఇప్పటికైనా పాలకులు స్పందించాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

ఉత్సాహంగా యోగా కార్యక్రమం



చిన్నబాలయ్యనగర్ మున్సిపల్ హైస్కూల్లో..

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు వేశారు. యోగా ప్రాధాన్యాన్ని పతంజలి యోగా యువభారత్ జిల్లా ఇన్‌చార్జి కోటేశ్వరరెడ్డి వివరించారు. అనంతరం ఇంటర్ పరీక్షల్లో కెమిస్ట్రీలో 60కు 60 మార్కులు సాధించిన మైథిలీ, రమణమ్మకు రూ.పది వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అధ్యాపకుడు కొండయ్య అందజేశారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ గిరి, రమణారెడ్డి, ఆర్ఐఓ వరప్రసాద్‌రావు, డీవీఈఓ మధుబాబు, ఎన్నెస్సెస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ప్రసన్న, భారతి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

- చిన్నబాలయ్యనగర్‌లోని మున్సిపల్ హైస్కూల్లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి బాలబ్రహ్మాచారి, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ రేవతి పాల్గొన్నారు.
- నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో హరిత యోగా, ఏక్ పేడ్.. మా కే నామ్ కార్యక్రమాలను నాయగో ఎడ్యుకేషన్ ట్రస్ట్, ఆయుష్, ఎన్నెస్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జేసీ కార్తీక్ మాట్లాడారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, యగ్నేష్, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బారకాసు): పుత్తా ఎస్టేట్స్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఎస్టేట్ మహిళా వాకర్స్ ప్రెసిడెంట్ పర్వీన్, సెక్రటరీ నళిని, ట్రెజరర్ లలిత తదితరులు పాల్గొన్నారు.